ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024
5
శ్రీకాకుళం



16న ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 16న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అరసవల్లి రోడ్డులో గల కన్నయ్యకాలనీలో ఆదిత్య అకాడమీలో నిర్వహిస్తున్న ఎంపికల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు వారి ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు ప్రవేశరుసుము రూ.300 చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440677201, 9989978727 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమవుతున్నారు. 61 రోజుల విరామం అనంతరం సముద్రంలో మళ్లీ మర పడవలు, సంప్రదాయ తెప్పలు కనిపించనున్నాయి. చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ప్రభుత్వం ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటను నిషేధిస్తుంది. అప్పట్నుంచి మత్స్యకారులు చేపల వేటకు దూరంగా ఉన్నారు. చేపల వేటపై ఉన్న నిషేధం గురువారం అర్ధరాత్రి ముగియనుండడంతో నేటి నుంచి యధావిధిగా చేపల వేటకు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వం ఐదేళ్లుగా వేట నిషేధం సమయంలోనే పరిహారం చెల్లిస్తూ వస్తోంది. ఈసారి సార్వత్రిక ఎన్నికల క్రతువు సాగడంతో పరిహారం చెల్లింపుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. కొత్త ప్రభుత్వం ఆమోదంతో త్వరలో భరోసా సొమ్ము మత్స్యకారుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్తున్నారు.



చేపల వేటకు చలో

- నేటి నుంచి నిషేధం ఎత్తివేత
- ఎన్నికల నేపథ్యంలో పరిహారం చెల్లింపులో జాప్యం
- పరిహారం కోసం ప్రాథమికంగా 12,952 మంది గుర్తింపు
- త్వరలో తుదిజాబితా ఖరారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మత్స్య సంపదకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై నిషేధం విధిస్తోంది. వేట నిషేధకాలానికి గానూ ప్రస్తుతం ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో రూ.పది వేలను సాయంగా అందిస్తోంది. ఏటా మే మూడో వారంలో మత్స్యకారులకు క్రమం తప్పకుండా డబ్బులు అందిస్తున్నా, ఈసారి మాత్రం ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం చోటుచేసుకుంది. మత్స్యకార భరోసా కోసం గత నెల రెండో జిల్లావ్యాప్తంగా అధికారులు సర్వే చేపట్టారు. లబ్ధిదారుల సర్వే, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం ఈనెల రెండో తేదీన ప్రాథమిక జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 15,375 మందిని సర్వే చేయగా, వారిలో ప్రాథమికంగా 12,952 మందిని అర్హులుగా గుర్తించారు. పలురకాల కారణాలతో 2,423 మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. మత్స్యకార భరోసాకు ఐదేళ్లుగా అమలు చేస్తున్న నిబంధనలతో ఈ ఏడాది 563 మంది మత్స్యకార భరోసాకు దూరం కానున్నారు. అదేవిధంగా ఈ ఏడాది నుంచి పరిహారం కోసం డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. దీంతో మరో 1860 మంది అనర్హులుగా మారారు.

ఇతర ప్రాంతాలకు తిరుగుముఖం

చేపల వేట సరిగా సాగక వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్లారు. అక్కడ బోటు యజమానుల వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. గుజరాత్‌లోని ఒక్క వీరావల్ ప్రాంతంలోనే జిల్లాకు చెందిన మత్స్యకారులు సుమారు మూడు వేల మంది ఉన్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై నిషేధం విధించడంతో, ఈ ఏడాది ఏప్రిల్ 15 తర్వాత వారంతా స్వస్థలాలకు చేరుకున్నారు. శుక్రవారం నుంచి చేపల వేటపై నిషేధం ఎత్తేయడం వారంతా తిరిగి వారు పనిచేసే ప్రాంతాలకు బయలుదేరారు.

కువైట్‌లో జిల్లావాసి మృతి

- వెళ్లిన కొన్ని ఘడియల్లోనే ప్రమాదం
- జింకిభద్రలో విషాదఛాయలు

ప్రజాశక్తి - సోంపేట, కవిటి

'బావ... కువైట్ క్షేమంగా వెళ్లిపోయా' అంటూ అతను చెప్పిన మాటలే చివరి మాటలయ్యాయి. కష్టపడి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలన్న అతని ఆశలు అడియాశలయ్యాయి. ఇటీవల కుటుంబసభ్యులతో కలిసి చేసుకున్న సంబరమే అతను చివరిగా గడిపిన సంతోష క్షణాలయ్యాయి. చిన్నతనం నుంచి కుటుంబ భారాన్ని మోసేందుకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి, వారిని కష్టాల కడలి దాటించే ప్రయత్నంలో సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం (31) కువైట్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే తామాడ చిరంజీవులు, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెల తర్వాత లోకనాథం ఒక్కడే కుమారుడు. రెక్కాడితే గానీ డొక్కాడని చిరంజీవులు, నారాయణమ్మ తమ కష్టంతో ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపించారు. ప్రస్తుతం చిరంజీవులు కాకినాడలో క్రరమిల్లులో పనిచేస్తుండగా, నారాయణమ్మ గ్రామంలోనే వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. చిన్నప్పట్నుంచీ కుటుంబ భారాన్ని మోసేందుకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూస్తూ పెరిగిన లోకనాథం పదో తరగతిలోనే చదువు ఆపేసి కుటుంబానికి అండగా ఉండేందుకు కువైట్ చేరుకుని ఆరేళ్లుగా ఒకే కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏప్రిల్‌లో కుటుంబానికి సంబంధించిన సంబరం ఉంటే గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు, బంధువులతో సరదాగా గడిపి సంబరంలో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణానికి సమయం కావడంతో ఈనెల ఎనిమిదో తేదీన హైదరాబాద్‌లో ఉన్న అక్కా బావ తెలుకల దమయంతి, కాంతారావు ఇంటికి చేరుకున్నాడు. అక్కడ రెండు రోజులు గడిపి మంగళవారం కువైట్ చేరుకున్నాడు. వెళ్లేసరికి రాత్రి కావడంతో కాంతారావుకు ఫోన్ చేసి 'బావా క్షేమంగా వెళ్లిపోయా'. నిద్ర వస్తుంది పడుకుంటాను' అని చెప్పి నిద్రలోకి జారుకున్నాడు. ఆ రాత్రి వారు ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదంలో సంభవించడంతో ఆ నిద్రలోనే ఆయన ఆయువు ఆహుతి అయింది. ఆ కుటుంబానికి తీరని కడుపుకోత మిగిల్చింది. విషయం తెలుసుకున్న లోకనాథం తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సమాచారం అందుకున్న తండ్రి నారాయణ కాకినాడ నుంచి కొడుకు కడచూపు కోసం బయలుదేరాడు. లోకనాథం మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.



తామాడ లోకనాథం (ఫైల్)



లోకనాథం మృతితో విలపిస్తున్న కుటుంబసభ్యులు

29న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే పోలీస్ యంత్రాంగానికి పెద్ద కేసులపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణము సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం జూలై 27 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్ల తెలిపారు. మరిన్ని వివరాల కోసం కక్షిదారులు, వారి న్యాయవాదులు టోల్ ఫ్రీ నంబరు 15100కు గానీ సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



ఒక్కపూట పని కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ఉపాధి హామీలో రెండు పూటలా పని రద్దు చేసి, ఒక్క పూట మాత్రమే పని పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని భైరిలో చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో గురువారం మాట్లాడారు. వేసవి అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, తాగునీటికి రూ.పది, గునపానికి రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. రెండుపూటలా మండుటెండలో పనిచేసినా రూ.300 కూలి చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. కోట్లాది మందికి అన్నం పెట్టే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 200 రోజుల పనిదినాలు కల్పించి రూ.600 చెల్లించాలన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం, ఉపాధి కూలీలకు మాత్రం బడ్జెట్‌లో కోత విధించడం దుర్మార్గమన్నారు. పని ప్రదేశంలో మృతి చెందిన కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, జాబుకార్డుదారులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు.



కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

కేంద్రమంత్రి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో అరుదైన అవకాశం తనకు దక్కిందని, మంత్రి పదవితో తన బాధ్యత పెరిగిందన్నారు. మంత్రిత్వ శాఖకు సంబంధించి వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు వినియోగంలోకి తీసుకొస్తానన్నారు. సామాన్యునికి ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్ తీసుకొస్తామని చెప్పారు. ప్రయాణికునికి భద్రత, సౌకర్యంగా ఉండేలా చూస్తామన్నారు. ఎయిర్‌పోర్టులను పర్యావరణహితం చేయడానికి చర్యలు చేపడతామని చెప్పారు. టైర్-2, టైర్-3 నగరాలకు విమానాశ్రయాలు తీసుకురావడం, విమానయానం సామాన్య ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. రికార్డు సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలకు డొమెస్టిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీని పెంచుతామని చెప్పారు. కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్, కార్యదర్శి వి.వాల్నమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహన్ నాయుడు

మంత్రి పదవి ఇచ్చి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో 14 లక్షలకు పైగా జనాభా ఉన్న కళింగ సామాజిక తరగతికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించి న్యాయం చేయాలని కళింగసీమ సేవా సమితి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అధ్యక్షులు హనుమంతు కృష్ణారావు, పేడాడ జనార్ధనరావు కోరారు. నగరంలోని అఫీషియల్ కాలనీలోని కృష్ణారావు నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కళింగులకు రాష్ట్ర మంత్రి పదవి ఇచ్చారని, అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు ప్రభుత్వాల్లో మంత్రి, ప్రభుత్వ విప్ పదవులు ఇచ్చారని, ఈ మంత్రివర్గంలో తమ సామాజిక తరగతికి చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలను గెలిపించుకోవడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లోనూ టిడిపి కూటమి విజయంలో కళింగ సామాజిక తరగతి కీలకపాత్ర పోషించిందని చెప్పారు. ఇతర సామాజిక తరగతులకు పదవులు ఇవ్వడంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, జిల్లాలో ఎంతమందికి పదవులు ఇస్తే అంత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నామన్నారు. జిల్లా నుంచి కూన రవికుమార్, బెందాళం అశోక్ గెలుపొందినందున వీరిలో ఎవరికి స్థానం కల్పించినా తమ సామాజిక తరగతి సంతోషిస్తుందని తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు కె.టి.నాయుడు, బి.సన్యాసిరావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కళింగ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో న్యాయవాది గురుగుబెల్లి నర్సింహమూర్తి , టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బొణిగి భాస్కరరావు, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు తదితరులు మాట్లాడారు. మంత్రివర్గంలో కళింగ సామాజిక తరగతికి చోటు కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న హనుమంతు కృష్ణారావు

కలెక్టర్‌ని కలిసిన శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావును ఆయన ఛాంబరులో కలిశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తమీమ్ అన్సారియాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలో డ్రయినేజీ వ్యవస్థ, వార్డుల్లో మౌలిక వసతులపై చర్చించారు. శ్రీకాకుళం నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, చల్లా వాసు తదితరులున్నారు.



శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

గర్భిణులను వేధిస్తున్న రక్తహీనత

- 80శాతం మందిలో మైల్డ్ ఎనీమియా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు
- పోషకాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వల్లే...

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఐరన్ లోపంతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. ఫలితంగా ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదీ పలువురు గైనకాలజీ వైద్య నిపుణులు చెప్తున్న మాట. ఐరన్ లోపంతో బాధపడే గర్భిణులను సివియర్ ఎనీమియా, మైల్డ్ ఎనీమియాగా పిలుస్తారు. సాధారణంగా 80 శాతం గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శ్రీకాకుళం నగర పరిధిలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రతినెలా సుమారు 200 నుంచి 300 వరకు ప్రసవాలు చేస్తుంటారు. వీరిలో సుమారు 180 మంది గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టుగా చెప్తున్నారు. ప్రసవ వేదన మొదలవగానే ముందుగా వైద్యులు వారి కుటుంబ సభ్యులకు రక్తం యూనిట్లు సిద్ధం చేసుకోవాలని చెప్తుంటారు. మరో 15 శాతం మందిలో మాత్రమే సాధారణ స్థాయి కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉంటోంది. మరో ఐదు శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు.

రక్తహీనత నిర్ధారించేది ఇలా...

హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించడం ద్వారా రక్తహీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములు ఉంటే సమస్య లేనట్టు. అంతకంటే తక్కువగా ఉంటే రక్తహీనతతో బాధపడుతున్నట్టే. సివియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో ఏడు గ్రాములు కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉంటోంది. ఇది అత్యంత ఇబ్బందికరమైనది. ఈ సమస్య ఎక్కువగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన గర్భిణుల్లో కనిపిస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఏడు నుంచి తొమ్మిది గ్రాముల మధ్య 80 శాతం మంది గర్భిణుల్లో ఉంటోంది. దీన్ని మైల్డ్ ఎనీమియాగా చెప్తున్నారు. గర్భం దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల మైల్డ్ ఎనీమియాలో ఉన్న ఎనీమియా స్థాయికి గర్భిణులు చేరుతున్నారు.

ఇదీ ప్రధాన కారణం

రక్తహీనత బారిన పడడానికి ప్రధాన కారణం పోషకాహార లోపంగా చెప్తున్నారు. ఎక్కువ మందిలో ఐరన్ లోపం కనిపిస్తోంది. ఎ, బి12, బి2, సి, డి, ఇ విటమిన్లు, రాగి, జింక్ వంటి లోపం వల్ల రక్తహీనత బారిన పడుతున్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణుల్లో తీవ్రమైన అలసట, కళ్ల పాలిపోవడం, ఆయాసం, గుండె దడ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఇవీ సమస్యలు..

పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. హిమోగ్లోబిన్ ఏడు గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ సమయంలో హార్ట్ ల్యూర్ కొన్నిసార్లు మరణానికి కారణమవుతున్నాయి. ప్రసవ మరణాల్లో ఇన్ డైరెక్ట్ కారణాల్లో ఇదొకటని నిపుణులు చెప్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి లక్ష ప్రసవాల్లో 54 మంది ఇలా మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో ఈ రేషియో ఇంకా ఎక్కువే.

ఆ వయసు కీలకం

గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు ముందస్తు చర్యలే మార్గమని చెప్తున్నారు. ముఖ్యంగా, 10-19 ఏళ్ల లోపు వయసున్న బాలికల్లో రక్తహీనతను నిర్ధారించే పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం, మందులు అందించడం వల్ల కోలుకుంటున్నారని, వివాహ సమయానికి సమస్యకు శాశ్వతంగా చెక్ చెప్పవచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

పోషకాహారంతో మేలు

పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ చెప్పవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో ఆకుకూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, పళ్లు తీసుకోవాలి. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు బెల్లంచిక్కీలు వంటివి రోజూ తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికారని వైద్యులు చెప్తున్నారు. చాలామందికి పోషకాహారం తీసుకునేందుకు అవకాశమున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ సమస్య ఎదురవుతోందని చెప్తున్నారు.



ముందు నుంచే జాగ్రత్తలు అవసరం

గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోషకాహారం తీసుకోకపోవడం, చిన్న వయసులోనే పెళ్లిళ్ల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. ప్రతి ఐదుగురు గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. వీరికి తగిన మందులతోపాటు డైట్ ప్లాన్ చెప్తున్నాం. ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదురవకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ సంపతిరావు శ్రీదేవి , గైనకాలజిస్ట్

ఎదిగే వయసులో గర్భం దాల్చడం వల్ల సమస్య

రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య అధికంగానే ఉంటోంది. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే వారికి అవసరమైన ఐరన్ ఇంజెక్షన్లు, రక్తం ఇస్తాం. ఎదిగే వయసులో పెళ్లిళ్లు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం వల్ల సమస్య అధికమవుతోంది. పీరియడ్స్ సమయంలో హెవీ బ్లీడింగ్ కావడం, అందుకు అనుగుణంగా పోషకాహారం తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. 10-19 ఏళ్లలో పాఠశాల, కళాశాలల పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడం వల్ల సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపించేందుకు అవకాశం ఉంది.



- డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, సీనియర్ గైనకాలజిస్టు, డిఎంహెచ్‌ఒ



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో ఐదేళ్లుగా భూకబ్జాలు విచ్చలవిడిగా పెరిగాయని, వాటిపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో ఆర్డిఒ భరత్ నాయక్కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పలాసలో భూ కబ్జాలు పెరిగిపోతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్కు పలుమార్లు ఫిర్యాదు చేశామని అన్నారు. అలాగే పలాస తహశీల్దార్కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం పలాసలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి నాయకులు బాబూరావు, కామేశ్వరరావు, సూర్యనారాయణ, దువ్వాడ హేంబాబుచౌదరి, విఠలరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్కు పొందూరు ఖద్దరు అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస



పొందూరు ఖద్దరును అందజేస్తున్న రామ్మోహనరావు

జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్కు ఆమదాలవలస నియోజకవర్గ జనసేన ఇన్ఛార్జి పేడాడ రామ్మోహనరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించి కూటమి అభ్యర్థి విజయానికి రామ్మోహనరావును పవన్ అభినందించినట్లు తెలిపారు. అనంతరం పవన్కు శాలువతో సత్కరించి పొందూరు ఖద్దరును అందజేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై హర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస



మోహనరావు

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేస్తూ సిఎం చంద్రబాబు సంతకం చేయడంతో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. భూ హక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు చేసిన ఉద్యమం ఫలించిందని అభిప్రాయపడ్డారు.

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసినట్లు సంతకం చేయడం హర్షణీయమని ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు పాత్రో ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ప్రజలతో పాటు న్యాయస్థానాల ఉనికికి చేటు కలిగించేలా జిఒ 512ని గత ప్రభుత్వం రహస్యంగా తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ న్యాయవాదులు సుదీర్ఘ పోరాటం చేసిందని గుర్తు చేశారు. భవిష్యత్లో న్యాయస్థానాలు, న్యాయవాదుల సంక్షేమానికి మరిన్ని ఆహ్వానించదగ్గ చర్యలు చేపట్టాలని కోరారు.

విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. మట్టి తవ్వకాలతో కొంతమంది వ్యక్తులు కాసులు సంపాదించుకుంటున్నారు. మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైన్స్, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరి. కానీ, అక్రమార్కులు అనుమతులు అవసరం లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆరో వార్డు అంతరకుడ్డలో చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ఎక్స్కవేటర్లు, ట్రాక్టర్లు తరలివచ్చి మట్టిని తరలిస్తూ... సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికలు, ఫలితాల హడావిడిలో అధికారులు నిమగ్నమై ఉండగా, అక్రమదారులు ఆదే అదనుగా చెరువులో మట్టిని తరలించుకుంటున్నారు. సమీపంలో ఉండే రియల్ ఎస్టేట్లు, ఇళ్ల పునాదుల్లో వేయడానికి మట్టిని తరలిస్తున్నారు. చెరువుల్లో రైతుల అవసరాల కోసం అడుగు లోతులో మట్టిని తవ్వుకున్నా అనుమతులు అవసరం లేదు. అయితే పదుల అడుగుల లోతులో తవ్వుతు మట్టిని తరలిస్తుండడం వల్ల సమీప ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిల్వ ఉండిపోతే అందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు చెబుతున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.500 నుంచి రూ.700 వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. దీన్ని నియంత్రించాల్సిన రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అక్రమ మట్టి తవ్వకందారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ అక్రమంగా మట్టి తరలించిన స్థానిక నేతల సహకారం అందించడంతో అధికారులు మౌనం దాల్చాల్సి వచ్చింది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ నేతలు మాత్రం అక్రమార్జనకే ప్రోత్సాహం అందించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులు తక్షణం స్పందించి చెరువులో మట్టి తవ్వకాలు నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

మంత్రికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పాతపట్నం

విజయవాడ కరెన్సీ నగర్లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర మంత్రి మండలిలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులను బిజెపి నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, కె.విజయానందేల మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో మంత్రులు అచ్చెన్నాయుడు, మండిపల్లి రామ్ ప్రసాద్రెడ్డిలను కలసి దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

కోటబొమ్మాళి : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలోని ఆయన ఛాంబర్లో టిడిపి నాయకులు చల్ల సింహాచలం, మండల్లి జగదీష్, ఐతం కాలేజీ అసిస్టెంట్ ప్లేస్మెంట్ అధికారి లంక చైతన్య, వెలమల రాము, జనసేన యూత్ నక్క సోమేశ్వరరావు, అంధ పవన్కుమార్, తంగి మహేష్ శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే టిడిపి కళింగ కోమటి సాధికారిక కన్వీనర్ బోయిన గోవిందరాజులు, ఉత్తరాంధ్ర కళింగ కోమటిలు మంత్రిని కలిశారు. కళింగ కోమట్లను ఓబిసిలో చేర్చాలని కోరారు. ముందుగా దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

రణస్థలం రూరల్ : మంత్రి అచ్చెన్నాయుడును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాను కప్పి సన్మానించారు. ఎన్ఇఆర్తో పాటు చిన్న కుమారుడు సాయి చంద్, వెలిచేటి సింహాచల రాయుడు, మన్నె శ్యాంకుమార్ ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



శుభాకాంక్షలు తెలుపుతున్న వేణుగోపాలరావు

ఎమ్మెల్యే శిరీషకు అభినందనలు

పలాస : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు నియోజకవర్గం పరిధిలోని నాయకులు, వ్యాపారులు, అధికారులు గురువారం అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందిస్తూ సన్మానాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డిఇ కనమాలు, ఎఇ అవినాష్, కిడ్నీ ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజా, ఆర్ఎంఒ కూన మోహన్బాబు, నాబళ్ల శ్రీనివాసరావు, ఎంపిడిఒ మొట్ట వైకుంఠరావు, ఎంకటే శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు ఎంఇఒ డి.దాశరథి, ఆర్అండ్బి డీడీ సానుమాన రామినాయుడు, విద్యుత్శాఖ యూనియన్ నాయకులు గార రాజారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వి.విఠల్రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ హేంబాబుచౌదరి పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఘనంగా బాబ్జీ జయంతి

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటకు చెందిన సంఘ సేవకులు టంకాల బాబ్జీ జయంతి, వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్విసిటి కార్యాలయం వద్ద ఉన్న బాబ్జి విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉప్పు లింగరాజు, చింతు రామరావు, మార్పు విజయకుమార్, వైశ్య సంఘం నేతలు, టి.జోగారావు, ఊన్న రంగనాథ్, పి.సాయిప్రసాద్, ఎంపిటిసిలు వి.కేశవరాజ్, బి.బాలకృష్ణ, ఇట్రాజు సూరిబాబు, కుటుంబ సభ్యులు టి.గౌతమ్, అర్జున్, సదాశివుని కృష్ణ, ఎస్విసిటి సిబ్బంది రమేష్, రామారావు, కరుణ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- కవిటి

2023-24 విద్యా సంవత్సరంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 1979-80 పదో తరగతి బ్యాచ్ ప్రోత్సాహకాలు అందించింది. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నెయ్యల చరణ్, ఎ.భరద్వాజ్, పిరియా సాత్వికకు ఎంఇఒ ధనుంజయ మజ్జి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పిరియా పద్మనాభం, తోట రామారావు, కీలు చంద్రశేఖర్, జె.వి.రమణ, బి.హిమగిరి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : విద్యార్థి మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి



విలపిస్తున్న కుటుంబసభ్యులు

మండలంలో పలాస రోడ్డు ఆకులమ్మ ఆలయ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడడంతో పడ్డ గ్రామానికి చెందిన సాయిజెన్న (16) మృతి చెందారు. మృతుడి బంధువులు నాలుగు ఆటోలో పలాస వెళ్తున్నారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొని రోడ్డు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయిజెన్న తలకు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108లో చాపర పిహెచ్సికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సాయిజెన్న ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. మృతుడికి తండ్రి బొల్లపు జెన్న ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



సాయికుమార్

మండలంలోని పెద్దమురహరి పురానికి చెందిన విద్యార్థి సాయికుమార్ అదృశ్యమైనట్లు ఎస్ఐ సిహెచ్.రామారావు గురువారం తెలిపారు. తల్లిదండ్రులు సరస్వతి, మోహనరావువుల కుమారుడు స్థానికంగా ఆరో తరగతి చదువుతున్నాడు. చదువులో వెనుకబాటుతనం, బుద్ధిగా చదవకపోతే హాస్టల్లో వేసేస్తామని చెప్పి ఇంటి వద్ద హోమ్వర్క్ చేయాలని సాయికుమార్ని ఆయన అక్క వద్ద విడిచి నందిగాం మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. హాస్టల్లో వేస్తామని చెప్పడంతో భయపడి సాయికుమార్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన తరువాత బంధువుల ఇళ్లలో వెతికారు. ఇంటి నుంచి పారిపోయినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో విద్యుత్ సబ్ స్టేషన్కి అతి సమీపంలో ఉన్న జర్నలిస్టు కాలనీలో గురువారం ఉదయం హైహోల్టేజ్ రావడంతో గృహోపకరణాలైన ఫ్యాన్లు, ఇన్వెటర్లు, బల్బులు కాలిపోయాయి. ఈ ప్రాంతం లో సరైనా విద్యుత్ లైన్ లేకపోవడం తరుచూ సరఫరాలో హెచ్చు, తగ్గులు వస్తున్నాయి. దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్శాఖ అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యే అశోక్కు శుభాకాంక్షలు

కవిటి : ఎమ్మెల్యే బెందాళం అశోక్ను ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డితో పాటు కార్యాలయ ఉద్యోగులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి శివాజీ పాణిగ్రాహి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ వినోద్, టైపిస్ట్ రాజేష్, జీవన్, మనోజ్, పొల్లాయి అశోక్, పందిరి రమేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతిపై సంతాపం

పోలాకి: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారాని విధి నిర్వహణలో పల్లిపేటకు చెందిన ఆబోతుల లక్ష్మణరెడ్డి (56) బుధవారం మృతి చెందారు. పల్లిపేటకు చెందిన లక్ష్మణరెడ్డి శ్రీకాకుళం టూ టౌన్ పోలీస్స్టేషన్లో కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నారు. ఈయన చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారంలో విధుల్లో పాల్గొనేందుకు మంగళవారం వెళ్లారు. బుధవారం ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే తోటి సిబ్బంది సమీప ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం పల్లిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య కళావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, తార రామకృష్ణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


పలాస: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని పలాస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి అన్నారు. ఈ మేరకు పలాస నుంచి మొగిలి పాడు వరకు పలు వీధుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, బూట్లు, బ్యాగులు, భోజనం ఉచితంగా అందిస్తుందని అన్నారు. కార్పొరేటర్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పలాస విద్యార్థులు ఉన్నత ప్రతిభను సాధించారని గుర్తుచేశారు. అందుకు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తవిటయ్య. ఆర్.రాజ్యలక్ష్మి, కె.మాధవరావు, శంకరరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, శాంతిలు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలి

పలాస : పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు మండలాల్లోని గుర్తింపు ఉన్న ప్రయివేటు పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఎంఆర్సిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉందో? లేదో? ముదుగా తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సంక్షిప్త వార్తలు

ఈ-సెట్లో యశ్వంత్కు రాష్ట్ర ద్వితీయ ర్యాంకు



యశ్వంత్

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇసిఇ డిప్లొమో పూర్తిచేసిన కోటబొమ్మాళికి చెందిన బోయిన యశ్వంత్ ఇటీవల విడుదలైన ఎపి ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్, వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యశ్వంత్ తల్లితండ్రులు, అధ్యాపకుల కృషిని డైరెక్టర్ అభినందించారు. కృషి, పట్టుదల, కఠోర శ్రమ, క్రమశిక్షణ ఉంటే ఎటువంటి లక్ష్యాలైనా సాధించవచ్చుని అన్నారు. యశ్వంత్ మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించాలని అన్నారు. డైరెక్టర్తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బి.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ప్రయివేటు పాఠశాలల తనిఖీ

కొత్తూరు : రాష్ట్ర విద్యా కమిషనర్ ఆదేశాలు మేరకు ఎంఇఒ, కొత్తూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు ప్రయివేటు పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఊన్న శ్రీరాజ్, శ్రీనివాస్, మహర్షి పాఠశాలను సందర్శించి తనిఖీలు చేశారు. పాఠశాలల అనుమతి పత్రాలను, రికార్డులను పరిశీలించారు. అలాగే మౌలిక వసతులను పరిశీలించారు. ఉన్నతాధికారులకు ఈ నివేదికను అందజేస్తామని తెలిపారు. వీరితో సిబ్బంది కె.రాజేష్ ఉన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ తీసుకోవాలి

సంతబొమ్మాళి: ఖరీఫ్ సీజన్కు సంబంధించి వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంతబొమ్మాళి ఇన్ఛార్జి ఎఒ ఆర్.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ విత్తనాలు కావాల్సిన రైతులు వారికి అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా తమ తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఎంటి యు 7029, ఎంటియు 1224, ఎంటియు 1061, ఎంటియు 1064, ఎంటియు 1121, బిపిటి 3291, బిపిటి 5204, ఎంటియు 1318, ఆర్జిఎల్ 2537 రకాల వరి విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నమోదు చేయించుకున్న రైతులకు రెండు రోజుల్లో ఆర్బికెల ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రణస్థలం రూరల్: ప్రజల సౌకర్యార్థం ఆర్డిఎస్ఎస్ స్కీమ్లో భాగంగా కొత్తగా వేస్తున్న ప్రత్యేక 24 గంటల విద్యుత్ లైన్ అనుసంధాన పనుల నిమిత్తం రణస్థలం 33/11 కెవి సబ్స్టేషన్ పరిధి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని నగరపాలెం, బండిపాలెం, కంబాలపేట, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నణపాలెం, సంచాం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హామీల అమలుపై హర్షం

పలాస : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు గురువారం మొదటి సంతకం చేయడం హర్షణీయమని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గ టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా డిఎస్సి, సామాజిక పింఛను పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు, స్కిల్ డవలప్మెంట్పై తొలి సంతకం చేయడంలో ప్రజలకు మేలుచేకూరుతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, మామిడి తాతారావు, లచ్చయ్య రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

కవిటి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలను ఎనిఒ ధనుంజయ మజ్జి ఆయా పాఠశాలలకు గురువారం అందజేశారు. 6,7 తరగతులకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో పుస్తకాలు అందలేదని, 8 నుంచి 10 తరగతులకు సంబంధించి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందినట్టు తెలిపారు. ఈ పంపిణీలో సిఆర్పిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన క్షతగాత్రుడు కాల తాతయ్యకు అండగా నిలిచి సచివాలయ ఉద్యోగులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా టైల్స్ బండి నుంచి టైల్స్ బయటకు తీస్తుండగా అది జారి తాతయ్య కాళ్లపై పడడంతో విరగిపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని తాతయ్య కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని సచివాలయం ఉద్యోగులు తమ వంతుగా గురువారం అతనికి రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్మథరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

కోటబొమ్మాళి: ప్రభుత్వ యాజమాన్యంలోని 12 ఉన్నత, 94 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులకు గురువారం కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు బుధ, గురువారాల్లో కిట్లను ఆయా పాఠశాలలకు పంపించామని అన్నారు. అక్కడ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేస్తారని అన్నారు. మండలానికి చేరిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న నాగేశ్వరరావు

ఎస్ఆర్ యూనివర్సిటీతో 'ఐతమ్' ఒప్పందం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మేంట్ ఇంజినీరింగ్ కళాశాల తెలంగాణా వరంగల్, ఎస్ఆర్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందాన్ని గురువారం కుదుర్చుకుంది. ఈ మేరకు ఎస్ఆర్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ అరెన్డీ ప్రొఫెసర్ ఎం.బాలాజీ, ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు పరస్పరం అవగాహన ఒప్పంద ధ్రువీకరణ పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం వల్ల ఎస్ఆర్, యూనివర్సిటీ, ఐతమ్ కళాశాలలు అకడమిక్, పరిశోధన, సాంస్కృతిక రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించడం కోసం ఒకరికొకరు సహకరించుకోనున్నట్టు వెల్లడించారు. అలాగే అధ్యాపకులు, విద్యార్థుల వారి వారి వృత్తులో అభివృద్ధి చెంచేందుకు అవసరమైన సదస్సులు, వర్కు షాపులు కలిసిమెలసి నిర్వహించేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ ఒప్పందం 5 ఏళ్ల పాటు కొనసాగుతుందని ఎంటెక్, పిహెచ్ఐ వంటి విభాగాల్లో పరిశోధన చేసేందుకు నిధులు కేటాయించడం వంటి అంశాల్లో చొరవతీసుకుంటూ రెండు సంస్థల అభివృద్ధికి పరస్పరం కృషిచేస్తామని ప్రొఫెసర్ బాలాజీ, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు తెలిపారు. కార్యక్రమంలో ఐతమ్ ప్రిన్సిపాల్, డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు డాక్టర్ సిహెచ్.రమేష్, డాక్టర్ డి.విజయకుమార్, డాక్టర్ బి.వి.రమణ, డాక్టర్ బి.రాజేష్లు పాల్గొన్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి- బూర్జ



మాట్లాడుతున్న సిఐ దివాకర్ యాదవ్

మండలంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని, దీనికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆముదాలవలస సిఐ దివాకర్ యాదవ్ తెలిపారు. స్థానిక పోలీస్స్టేషన్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలు కొన్ని దొంగతనాలు కేసులు ఈ మండలంలో నమోదయ్యాయని అన్నారు. వేసవిలో ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా ప్రధాన తలుపులకు సరైన తాళాలు వేయకుండా నిద్రలోకి జారుకుంటున్నారని అన్నారు. ఇదే ఆదునుగా దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలను పగలకొట్టి బంగారు ఆభరణాలు, నాగదు, వెండి వస్తువులను దోచుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా తలుపులను మూసివేసి తాళాలు వేయాలన్నారు. గామాల్లో తమ పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ముఖ్యమని సూచించారు. పోలీస్ యంత్రాంగం నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లోకి ప్రవేశిస్తే... వారిపై నిఘా ఉంచి తమకు సమాచారం అందజేయాలన్నారు. దొంగతనాల అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈయనతో పాటు ఎస్ఐ జి.వి.ప్రసాద్ ఉన్నారు.



సమీక్షిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

మహిళా సంఘాలతో సమీక్ష

ఇచ్ఛాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల సభ్యులకు ఇవ్వనున్న వివిధ రకాల రుణాలు ప్రగతిపై ఎపిఎం ప్రసాదరావు గురువారం సమీక్షించారు. గ్రామ సంఘం నుంచి సామాజిక పెట్టుబడి, బ్యాంకుల ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకునే ముందు రికార్డుల పరిశీలన, ఈ రుణాలు వారు ఆదాయాభి వృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించే పద్ధతి, సభ్యులు అంతమంది ఉపయోగించుకుంటు న్నారా? లేదా? కొంతమందే ఉపయోగించుకుంటు న్నారా? అనేది పరిశీలించారు. సభ్యులకు తెలిసే విధంగా, రుణాలు చెల్లింపు వాయిదాలు, రికార్డు నిర్వహణ సమావేశాల్లో చర్చించుకునే విధానం, వంద రుణాలు తిరిగి చెల్లింపు తదితర అంశాలపై సభ్యులతో చర్చించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు తిరుపతిరావు కోరారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాను ఆమె ఛాంబరులో గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంఖ్యను పెంచి మహిళా కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐలో టెక్నికల్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పర్మినెంట్ ఉద్యోగుల ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, సహాయ కార్యదర్శి పార్థసారథి, గణేష్, ఇంజినీర్ కార్మిక నాయకులు సతీష్, రాఘవ, రమణ, సోగ్గాడు, సురేష్ సీతమ్మ, ఇందు, ఇందిర, మంగవేణి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

పాతపట్నం: పాతపట్నం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లను రిజర్వేషన్ ప్రకారంగా భర్తీ చేసేందుకు గురువారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 7వ తరగతికి 23 మంది, 8వ తరగతికి 9 మంది, 9వ తరగతికి 8 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు రాసిన విద్యార్థులకు అర్హత బట్టి మిగులు సీట్లు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి వద్ద జిల్లా అంధత్వ నివారణా సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. సూర్య ఆస్పత్రి డాక్టర్ ఇడదాసుల యశ్వంత్ రోగులకు ఉచితంగా బిపి, సుగర్, గుండె జబ్బుల స్క్రీనింగ్ నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇడదాసుల వెంకట సత్యనారాయణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్, సూర్య ఆస్పత్రి సహకారంతో సేవా ఫౌండేషన్ కొంత కాలంగా ఎన్నో వైద్య శిబిరాలను నిర్వహించిందని అన్నారు. ఇలాంటి వైద్య శిబిరాల ద్వారా పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 56 మందికి ఆపరేషన్ అవసరమని శంకర్ ఫౌండేషన్ బస్సులో విశాఖపట్నం తరలించారు. మిగిలిన వారికి వైద్యులు మందులు కంటి అద్దాలను సూచించారు. అలాగే వైద్యులు సీపాన వేణుగోపాలరావు గుండె జబ్బుల స్క్రీనింగ్ శిబిరానికి వంద మంది రోగులు పాల్గొన్నారు. బిపి, సుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు, సభ్యులు పసుపురెడ్డి సురేష్, భైరెడ్డి దాసు, బలివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.